క్లుప్తంగా

నైపుణ్యగణన సర్వేకు వ్యాపారులు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న ఎపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య గణన సర్వేకు వ్యాపారులందరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. షరాఫ్ బజారులో బుధవారం జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తమ వివరాలు తెలియజేయటం వలన ప్రభుత్వ పథకాలు అందే అవకాశం ఉందన్నారు.

మురుగు సమస్య తలెత్తకుండా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 9,10 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. మురుగు కాల్వలు వ్యర్థాలతో నిండి ఉండటాన్ని గమనించిన ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజు కాల్వలను బాగు చేయకపోవటం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

18న ఏఎన్‌యూలో హకీం జానీ అతిథి ప్రసంగం

తెనాలిఅర్బన్: తెనాలికి చెందిన ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీం జానీ ఈనెల 18న ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ఎంబీఏ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ట్రావెల్ అండ్ టూరిజమ్ మేనేజ్‌మెంట్‌పై అతిథి ప్రసంగం చేయనున్నారు. ఈమేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పటాలిటీ మేనేజ్‌మెంట్, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ స్టడీస్ శాఖాధిపతి ప్రొఫెసర్ పి.పూర్ణచంద్రరావు ఆహ్వాన పత్రాన్ని పంపినట్లు ఆయన తెలిపారు. పర్యాటక ప్రదేశాలపై ఆయన అనేక వ్యాసాలు రాశారు.

రాజకుమారి దంపతులకు పావులూరి ట్రస్ట్ పురస్కారం

తెనాలి: పావులూరి సరోజినీదేవి, బాపయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆదర్శ దంపతుల పురస్కారాన్ని 2024 సంవత్సరానికి మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, ముకుందరావు దంపతులకు ప్రదానం చేయనున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు పావులూరి శ్రీనివాసరావు తెలియజేశారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆడిటోరియంలో ఈనెల గురువారం జరగనున్న ట్రస్ట్ 17వ వార్షికోత్సవంలో ఈ పురస్కారాన్ని అందజేస్తారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య చేతులమీదుగా పురస్కార ప్రదానం జరుగుతుందని, ఇదే వేదికపై ఐపీఎస్ ఉన్నతాధికారి కేజీవీ సరిత 'తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు' అనే అంశంపై ధార్మి కోపన్యాసం చేస్తారని మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించే వార్షికోత్సవంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, పావులూరి భానుమూర్తి పాల్గొంటారని వివరించారు.

వృత్తి స్క్రాప్ విక్రయాలు.. ప్రవృత్తి చోరీలు!

- చోరీ కేసుల్లో పట్టుబడ్డ మహిళల తీరిది
- పురుషులకు దీటుగా భారీ చోరీలు



రోశమ్మ, మహంకాళమ్మ వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

తెనాలిరూరల్: ఆ మహిళల వృత్తి చిత్తు కాగితాలు ఏరుకోవడం, స్క్రాప్ సేకరించి అమ్ముకోవడం. కానీ ప్రవృత్తి చోరీలు చేయడం. పురుషులకన్నా రాటు తేలి.. ఇవాళ భారీ చోరీలు చేయడానికి అలవాటు పడ్డారు. తెనాలి రామలింగేశ్వరపేటలో ఈ నెల 7వ తేదీన జరిగిన భారీ చోరీ కేసులో వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన మహిళలు చేసిన చోరీల గురించి తెలిస్తే పురుషులు సైతం విస్మయం వ్యక్తం చేయాల్సిందే.

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గుళ్లపల్లికి చెందిన శీలం రోశమ్మ, శీలం మహంకాళమ్మలు ప్రతిరోజు అమృతలూరు, వేమూరు, తెనాలిలో తిరుగుతూ చిత్తుకాగితాలు ఏరుకుని, పాత ఇనుము స్క్రాప్ సేకరించి విక్రయించి కుటుంబాలను పోషించుకుంటుంటారు. చిత్తు కాగితాలు ఏరుకునే మాటున వీరు చేసే చోరీల గురించి తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే. ఏకంగా భారీ చోరీలు చేయడానికి వీళ్లు అలవాటుపడ్డారు. అందినకాడికి దండుకోవడం విక్రయించి సొమ్ము చేసుకోవడం ప్రవృత్తిగా మార్చుకున్నారు.

చోరీలు చేసేది ఇలా..

చిత్తు కాగితాలు ఏరుకునే వంకతో గోతాల (పెద్ద సంచులు)ను తమ వెంట తీసుకెళతారు. వాటిలో కొన్ని కాగితాలు, ఇనుప రాడ్డులు ఉంచుకుంటారు. వీధుల వెంట తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్ల కోసం వెతుకుతారు. ఒకటి రెండు రోజులు గమనించి ఇంట్లో ఎవరూ ఉండడం లేదని నిర్ధారించుకుని తమ గోతాల్లో ఉన్న రాడ్డులతో తాళాలు/గొళ్లాలను పగులగొట్టి అందినకాడికి దండుకుంటారు.

జంపని షుగర్ ఫ్యాక్టరీలో భారీ చోరీ

వేమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూత పడిన జంపని షుగరు ఫ్యాక్టరీలో 2022 చివరలో భారీ చోరీకి పాల్పడ్డారు. ఫ్యాక్టరీలో ఉన్న సుమారు 30 మోటార్లు చోరీ చేశారు. చోరీ చేసిన వాటిలో కొన్నిటిని స్క్రాప్‌కు విక్రయించారు. చోరీపై సమాచారం అందుకున్న వేమూరు పోలీసులు 2023లో ఆరంభంలో కేసు నమోదు చేశారు. ఎట్టకేలకు నిందితులను గుర్తించారు. పోలీసుల రికార్డుల్లో పాత నేరస్తులుగా వీరి వివరాలు నమోదు కాలేదు. ఈ కేసులో పట్టుబడడంతో పూర్తి వివరాలను పోలీసుల డేటాబేస్‌లో సేవ్ చేశారు. అలానే అమృతలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పొలంలో ఉన్న మోటారును అపహరించారు. ఆ కేసులోనూ కొన్నాళ్లకు పట్టుబడ్డారు.

ప్రస్తుత కేసులో తెనాలి రామలింగేశ్వరపేటలో తాళం వేసి ఉన్న ఇంట్లో సుమారు రూ. 10 లక్షల విలువైన సొత్తు అపహరించారు. ఈ కేసులో పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజ్‌లతో పాటు పోలీసు రికార్డుల్లో ఉన్న పాత నేరస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చోరీ జరిగిన 7వ తేదీన రామలింగేశ్వరపేట తోట వారి వీధి–1లో ఎవరెవరు తిరిగారు? వారిలో స్థానికేతరులు ఎవరు? వంటి అంశాలను కెమెరాల పుటేజ్‌లలో పరిశీలించారు. చిత్తు కాగితాలు ఏరుకునే వారిలా వచ్చిన రోశమ్మ, మహంకాళమ్మలే అనుమానాస్పదంగా సంచరించారని పోలీసులు గుర్తించి వారిపై నిఘా ఉంచారు. పోలీసుల వద్ద ఉన్న పాత నేరస్తుల డేటా బేస్, చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీం సేకరించిన ఆధారాలతో ఈ ఇద్దరు మహిళల వివరాలు సరిపోవడంతో నిందితులు వీరే అని నిర్ధారణకు వచ్చి అరెస్ట్ చేశారు. ఇటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సైనేడ్ హత్యల నిందితురాలికి దేహశుద్ధి

తెనాలిరూరల్: వరుస సైనేడ్ హత్యల నిందితురాలికి ప్రజలు దేహశుద్ధి చేశారు. పట్టణంలోని యడ్లలింగయ్య కాలనీకి చెందిన తల్లీ కూతుర్లు రమణమ్మ, వెంకటేశ్వరి మరో మహిళతో కలిసి చేసిన సైనేడ్ హత్యలు తీవ్ర సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. పలువురి వద్ద అప్పులు తీసుకోవడం, తిరిగి చెల్లించే క్రమంలో వారిని నమ్మకంగా తీసుకు వెళ్లి సైనేడ్‌తో చంపేసిన పలు కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. సెప్టెంబరులో అరెస్టై జైలుకు వెళ్లిన వీరు సుమారు రెండు నెలల తర్వాత బెయిల్ పై విడుదలై బయటకు వచ్చారు. నిందితుల్లో ఒకరైన వెంకటేశ్వరి మంగళవారం యడ్లలింగయ్య కాలనీలో ఉన్న తన ఇంటికి వెళ్లడంతో స్థానికులు ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరి జైలు నుంచి రావడంతో యడ్లలింగయ్య కాలనీకి చెందిన పలువురు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వరుస హత్యలకు పాల్పడిన వారు తమ ఇళ్ల మధ్య ఉండటానికి వీల్లేదని, తల్లి కూతుర్ని ఇక్కడి నుంచి పంపించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తాను పిల్లలతో కలిసి ఇంట్లో ఉన్న సమయంలో కొందరు వచ్చి దాడి చేశారంటూ వెంకటేశ్వరి తెలిపింది. తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ వివరాలు తెలియజేసింది. విషయం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు స్థానికులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులు విచారణ చేపట్టినట్లు బుధవారం తెలిపారు.

ఫ్రీ ఇసుకకు ఆన్‌లైన్ రసీదు తప్పనిసరి



కొల్లిపర: నది పరివాహక ప్రాంతాల్లో స్థానిక అవసరాల కోసం నదిలో ఫ్రీగా ఇసుక తరలించే సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్‌లో వినియోగదారుల పేరుతో నమోదు చేసుకుని తద్వారా వచ్చిన ఫ్రీ ఇసుక వేబిల్లు తప్పని సరిగా ట్రాక్టర్ డ్రైవర్ దగ్గర ఉండాలని లోడింగ్, రవాణా సమయంలో పోలీసులు, రెవెన్యూ, ఇతర అధికారులు అడిగిన వెంటనే రసీదు చూపించాలని లేని పక్షంలో అక్రమ ఇసుక రవాణా పై చట్టపరమైన కేసులు నమోదు చేయటం జరుగుతుందని ఎస్ఐ పి.కోటేశ్వరరావు డ్రైవర్లకు సూచించారు. బుధవారం మండల పరిధిలో కృష్ణా నదిలో ఫ్రీ ఇసుక ద్వారా ఇసుక తరలించడానికి రీచ్‌లు వద్దకు వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లతో ఆయన ప్రభుత్వం ఫ్రీ ఇసుక విధానంలో పేర్కొన్న విధివిధానాల గురించి వివరించారు. రేపటి నుంచి బిల్లులు లేకుండా వచ్చిన వారిపై అక్రమ ఇసుక రవాణా పై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారిని తిరిగి పంపించారు. లోడింగ్ చేయడానికి వచ్చిన కూలీలకు కూడా తగు సూచనలు, సలహాలు తెలిపారు. వే బిల్లు లేకుండా కూలీలు ఇసుక లోడింగ్ చేయ వద్దని ఆదేశించారు. అలా లోడింగ్ చేసిన ట్రాక్టర్ తోపాటు కూలీలు పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కావున ఇసుక లోడింగ్ సమయంలో కూలీలు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నేడు మండలస్థాయి అధికారులకు శిక్షణ

కొల్లిపర: ప్రిన్సిపల్ డి.పి.ఆర్.సి ముఖ్య కార్య నిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్ గుంటూరు వారి ఉత్తర్వులు ప్రకారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై గురువారం, శుక్రవారం మండలంలోని గ్రామసర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. మొదటి బ్యాచ్ నేడు(గురువారం) శిక్షణా కార్యక్రమంలో మండల స్థాయి అధికారలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండవ బ్యాచ్ శుక్రవారం నాడు ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ వీఓఏ లు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు శిక్షణతరగతులు జరగనున్నట్లు తెలిపారు.

రహదారి విస్తరణకు సహకరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



విస్తరణ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలోని పలు ప్రధాన రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వాతి జూస్ స్టాల్ నుంచి సీతాంబ హోటల్ వరకు నూతనంగా చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ఇప్పటికే అనేక రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించటం జరిగిందన్నారు. ప్రస్తుతం శివాజీచౌక్‌లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. పట్టణంలో తాము చేపడుతున్న విస్తరణ పనులకు వ్యాపారులు, ప్రజలు సహరించాలని కోరారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ రూ.40 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులు సహకారంతో తెనాలిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ కె.శ్రీనివాసరావు, ఏఈలు సూరిబాబు, సునీల్ కుమార్, ఏసీపీ శ్రీమన్నారాయణ, టీపీవో సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

తెనాలిఅర్బన్: ప్రజలు తెలియజేసిన సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. రెండొవ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలు ఎక్కువగా ఫిర్యాదులు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులందరు సమన్వయంతో పనిచేస్తే సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆమె వెంట ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మెడ విరుపు తెగులతో అప్రమత్తంగా ఉండాలి

లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం



తెనాలిరూరల్: వరిలో వచ్చే మెడవిరుపు తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం అంగలకుదురు, చావావారి పాలెవ గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పర్యటించారు. పొలాలను పరిశలించి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నం మాట్లాడుతూ మెడ విరుపు తెగులును గుర్తిస్తే ట్రైసైక్లోజోల్ మందును ఎకరాకు 120 గ్రాముల చొప్పున వినియోగించాలన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతంల గురించి వివరించారు. క్షేత్ర సందర్శనకు వెళ్లి పొలాలను పరిశీలించగా చీడపీడలు, నాము తెగులును గుర్తించి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయశాఖాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ రానున్న రబీ సీజనుకు రైతులు జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము పంటలకు ఇన్సూరెన్స్‌ను చెల్లించాలన్నారు. వాటి వివరాలను రైతు సేవా కేంద్రాల్లో తెలుసుకుని మీ–సేవా కేంద్రాలు లేదా కామన్ సర్వీస్ సెంటరులో సంబంధిత రుసుమును చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. పశువుల్లో ఎద ఇంజక్షన్‌ల గురించి డాక్టర్ అనూష వివరించారు. ఏఈవో జి.మోహన్, వీఏఏ సాయిదీపక్, వీహెచ్ఏ రాజీకిరణ్, రైతులు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారుల బడా మోసం బట్టబయలు

- కిలోకు 150–200గ్రాముల తూకంలో తగ్గుదల
- తూనికలు కొలతల శాఖ ఆకస్మిక తనిఖీలు
- అధికారులను చూసి పరారైన తోపుడు బండ్ల వ్యాపారులు
- జాయింట్ కంట్రోలర్ నేతృత్వంలో 26 కేసులు నమోదు



తెనాలి: పట్టణంలో పండ్ల వ్యాపారం ఇష్టారాజ్యమైంది... తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేసేవారే పెద్దమోసానికి పాల్పడుతున్నారు...తప్పుడు తూకాలతో వినియోగదారులను అందినకాడికి దోచుకుంటున్నారు. ఏకంగా కిలోకు 200 గ్రాముల వరకు తూకం తక్కువ ఉన్నాయంటే కొనుగోలుదారులు ఎంతగా నష్టపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంవీఎస్ మాధురి, ఇద్దరు అసిస్టెంట్ కంట్రోలర్లు, నలుగురు ఇన్‌స్పెక్టర్లతో కలిసి బుధవారం పట్టణంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఇది తూకం మోసం బట్టబయలైంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని కూరగాయల మార్కెట్, మెయిన్‌రోడ్డు, గాంధీచౌక్, నెహ్రూరోడ్డులో విస్తృతంగా తనిఖీలు చేశారు. మొత్తం 26 కేసులు నమోదుచేశారు. ముఖ్యంగా తోపుడుబండ్లపై పండ్లు విక్రయిస్తున్న వ్యాపారులు పలువురు వీరిని చూసి, ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషీన్లను తీసుకుని పరారయ్యారు. మిగిలినవారి తూకాలను తనిఖీ చేశారు. కిలోకు 150 నుంచి 200 గ్రాముల తక్కువ రావడాన్ని గమనించి, ముగ్గురు పండ్ల వ్యాపారులపై కేసు పెట్టారు. వీటితో పాటు కూరగాయల మార్కెట్, స్టీలు, ఇత్తడి వస్తువుల షాపులు, స్వీట్ షాపులు, బేకరీలను తనిఖీ చేశారు. తూకపు రాళ్ల తూనికలు వాడుతున్న వ్యాపారులపై అయిదు కేసులు, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లకు స్టాంపు లేని కారణంగా 14 కేసులు, మెటల్ స్టోర్స్‌పై ఒకటి, స్వీట్‌షాపుల్లో తనిఖీలతో తూకం తక్కువ కారణంపై ఒకటి, స్వీటు ప్యాకెట్లపై డిక్లరేషన్ లేకపోవటంపై మరో కేసు నమోదుచేసినట్టు జాయింట్ కంట్రోలర్ మాధురి వెల్లడించారు. పౌరసరఫరాలశాఖ మంత్రికి చెందిన పట్టణంలోనే పండ్ల వ్యాపారులు ఇంతగా తూకం మోసాలకు పాల్పడటాన్ని చూసి ఆమె విస్మయం వ్యక్తంచేశారు. మరోసారి తప్పకుండా ఇక్కడ ఆకస్మిక తనిఖీలు చేస్తామని స్పష్టంచేశారు. ఈ తనిఖీల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్లు జి.కొండారెడ్డి, ఎస్.అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు కె.నాగేశ్వరరావు (చీరాల), శివశంకరరావు (నరసరావుపేట), జాన్‌సైదా (సత్తెనపల్లి), శేషసాయి (తెనాలి), సునీల్‌రాజు (గుంటూరు) పాల్గొన్నారు.

అన్నవరంలో తెనాలి గాయనిల 'సంకీర్తన'

తెనాలి: పవిత్ర పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో స్వామి వారి తెప్పోత్సవం సందర్భంగా బుధవారం తెనాలి గాయనీమణులు సంకీర్తన గానం చేశారు. పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం రెండుగంటలసేపు అన్నమయ్య సంకీర్తనలను గానం చేసి, ప్రేక్షకులను పరవశులను చేశారు. సంకీర్తన గురువు కొండపి వసుంధర, మారా లలిత కుమారి, మాజేటి వాసవి, గుబ్బా లక్ష్మీకుమారి, నంబూరు వినతి, లక్కరాజు కనకదుర్గ, కంభంపాటి లీలారత్నకుమారి గానం చేశారు. వీరికి తబలపై సాయి, కీబోర్డుపై పెద్దిరాజు వాయిద్య సహకారం అందించారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చెయ్యి ఎత్తితే బస్సులు ఆపేలా చూడండి

దయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు వినతులు

తెనాలిఅర్బన్: తెనాలి– గుంటూరు రూట్‌లో చెయ్యి ఎత్తితే బస్సు ఆపేలా చర్యలు తీసుకోవాలని జి.శ్రీనివాస్ కోరారు. డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డీఎం ఎ.రాజశేఖర్ ఫోన్‌లో ప్రజలు తెలియజేసిన వినతులు నమోదు చేసుకున్నారు. విజయవాడ రూట్‌లలో బస్సులను కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడుపుతున్నారని ప్రసాద్ ఫిర్యాదు చేశారు. తెనాలి– చినరావూరు పార్కు నుంచి సాయంత్రం 4.15కు బయలుదేరే మంగళగిరి, విజయవాడ బస్సు సమయం ఒకటిగానే ఉన్నాయని, తెనాలి– విజయవాడ సర్వీసు 4 గంటలకే బయలుదేరు విధంగా మార్పు చేయాలని చినరావూరుకు చెందిన వై.సోమయ్య విన్నవించారు. తెనాలి– మచిలీపట్నం, జువ్వలపాలెం నైట్ అవుట్ బస్సు, పేరేచర్ల బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. వీటిన్నింటినీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వనసమారాధన

తెనాలి: ఏపీఎస్ ఆర్టీసీ తెనాలి డిపో విశ్రాంత ఉద్యోగుల కార్తిక ఆత్మీయ సమ్మేళనం బుధవారం రూరల్ మండల గ్రామం అంగలకుదు రు శివారులోని వెలగా ఆదినారాయణతోటలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్, విశ్రాంత డీఎం రమేష్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించిన తరం ఉద్యోగులుగా విశ్రాంత ఉద్యోగులు తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న సమస్యలపైనా చర్చించుకున్నారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

తెనాలి: వంటగ్యాస్ వినియోగంపై దేశవ్యాప్తంగా లక్షమంది వినియోగదారులకు మరీ ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంగా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో అవగాహన సదస్సును నిర్వహించారు. స్థానిక సత్యనారాయణ ఇండేన్ గ్యాస్ ఎంటర్‌ప్రైజెస్ వారు ఏర్పాటు చేసిన సదస్సులో పంపిణీదారు ఎంపీ మురళీకృష్ణ గ్యాస్ వినియోగంపై తగిన సూచనలు చేశారు. ఐఓసీ కంపెనీ రూపొందించిన డిజిటల్ వీడియోను ప్రదర్శించి, గ్యాస్ వినియోగంలో మెలకువలను తెలియజేశారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి సదస్సుకు అధ్యక్షత వహించారు. ఏఎస్ఆర్ కాలేజీ, గుడివాడ విశ్రాంత ప్రిన్సిపాల్ పావులూరి శ్రీనివాసరావు మాట్లాడారు.

అరుదైన క్రీడలో మెరుస్తున్న తెనాలి ఆణిముత్యాలు

మల్లాంబ్ క్రీడలో చక్కగా తర్ఫీదు



మల్లాంబ్ క్రీడాకారులతో మౌలాబి, సర్దార్, ప్రసాదకుమారి

తెనాలి: భారతదేశంలో అతి ప్రాచీనమైన క్రీడ మల్లాంబ్. వివిధ రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన ఈ క్రీడ మన ప్రాంతంలో పరిచయం లేదు. శారీరక దృఢత్వానికి మల్లాంబ్‌ను మించిన క్రీడ లేదంటారు. ఇలాంటి క్రీడను తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలుకు చెందిన బాలబాలికలు సాధన చేయటం, ఏకంగా భీమవరంలో ఇటీవల జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొనటం విశేషంగా చెప్పొచ్చు.

పాఠశాలలో చెందిన దమ్ము నాగచైతన్య (8వ తరగతి), చందన కావ్యశ్రీ సుధ అమృత (7వ తరగతి), పాలపర్తి పావనీ శ్రీవిద్య (6వ తరగతి), బాణావత్ ఇంద్రానాయక్, మునిపల్లి వర్షితప్రియ, కె.శివయ్య, షేక్ సుహానా (9వ తరగతి)లు ఈ ఖ్యాతిని అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, పీఈటీలు కొడాలి గోవర్ధన, టి.ప్రసాదకుమారి కొంతకాలంగా విద్యార్థులను చదువుతోపాటు క్రీడలకేసి ప్రోత్సహిస్తున్నారు. ఎవరెవరికి ఏ క్రీడలో రాణిస్తారన్నది పరిశీలించి, ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నారు. ఆ క్రమంలో బాపట్లకు చెందిన రామకృష్ణ సేవాసమితి గత అక్టోబరులో మల్లాంబ్ వర్క్ షాపును నిర్వహించింది.

మల్లాంబ్‌లోని రోప్, పోల్, హ్యాంగింగ్ విధానాలను నేర్పారు. ముంబైకి చెందిన పద్మశ్రీ ఉదయ్ విశ్వనాథ్ దేశ్‌పాండే మూడురోజుల శిక్షణనిచ్చారు. స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు 12 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. వారిలో ఏడుగురు క్రమం తప్పకుండా సాధన చేస్తూ వచ్చారు. భీమవరంలో జరిగిన స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ పోటీల్లో పాల్గొని, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందుకున్నారు.